
# అతడు ఎయిడ్స్‌ను జయిస్తాడు...

ఎస్వీ. ప్రసాద్

అనంతపురం పెద్దాసుపత్రి ముందు నిలబడి వున్నాడు రాజు. రోడ్డుపైన పిచ్చిపట్టినట్లు పరిగెడుతున్న వాహనాలు.. రణగొణ ధ్వనులు..

తన భవిష్యత్తును తల్చుకోగానే రాజు వణికిపోయాడు. నిలువెల్లా కంపించిపోయాడు. మరి కొన్నాళ్లకు హెచ్ఐవి ఎయిడ్స్‌గా మారి జ్వరమొచ్చో బక్కచిక్కో యూనివర్శిటీలో అందరికి తెలిసిపోయి...



"-నూట రెండు రూంలో రాజుగారు ఉండ్లా వాడికి ఎయిడ్సంట!"

"చూసేకి మంచిగానే కనపడతా ఉన్నే"

"పైకి అంతా మెత్తగానే వుంటారు. లోపల్లోపల కుమ్ముతా వుంటారు"

తనకంటే అందరికీ అసహ్యం... జుగుప్స... భయం!

అట్లా బతగ్గలనా..లేదు లేదు!

పుట్టింతర్వాత ఎట్లాగూ చావాలి. చావు గురించి భయం లేదు. చావుకు గల కారణం తల్చుకుంటే భయం. ఆ కారణాన్ని చిలువలు పలువలుగా వర్ణించుకునే జనాలను తల్చుకుంటే భయం. చిలువలు కొండ చిలువలు... ఏహె చచ్చాక ఏమనుకుంటే నాకేం! అయితే చావే మేలు...మరైతే ఎలా చావాలి?

ఎలా ఏముంది? అనంతపురం రైతన్నల సంప్రదాయ ఆత్మహత్యాయుధం...పురుగుల మందు!

ఏమి రామయ్య దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?

ఏమీ లేదు ఉరేసుకు చద్దామా పురుగుల మందు తాగి చద్దామా అని...

**ప్రపంచాన్ని పీడిస్తున్న మహమ్మారి ఎయిడ్స్. ఈ భూతానికి ఎందరో అమాయకులు బలైపోతున్నారు. ఏ తప్పూ చేయకుండానే ఎయిడ్స్ బారినపడిన వ్యక్తులకి సంబంధించిన ఇతివృత్తాలే ఈ కథలు. ఒకే అంశంపై ఇద్దరు రాసిన కథలివి!**

ఇందులో ఆలోచించడానికేముంది? టెండ్ డాండ్ బ్రాండ్ పురుగుల మందు తాగితే సరి. మా తాతగారు కూడా అలాగే చచ్చారు. పురుగులు చావకపోయినా మనుషులు మాత్రం తప్పక చస్తారు. తప్పక తాగండి టెండ్ డాంగ్ బ్రాండ్...

లేదు లేదు నేనా వాసన భరించలేను. గబ్బు వాసన హబ్బా!

''-రాత్రంతా నిద్రలేదు. ఆస్పత్రి నిండా దోమలే. వానెమ్మ, ఎత్తకపోతాయి'' బీడీ పొగ వదుల్తూ చెబుతున్నారు. ఏ పేషెంట్ బంధువో మరి!

'నిద్రా..అవునవును! నిద్ర మాత్రలు వేసుకుంటాన్లే. సమ్మగ చావొచ్చు. అన్నీ ఒకచోట ఇవ్వకపోవచ్చు. అక్కడ కొన్ని అక్కడ కొన్ని తీసుకొని మింగి ప్రశాంతంగా ఈ ప్రపంచానికి వీడ్కోలు చెప్పేయవచ్చు'

ఆలోచనల్నుంచి తేరుకొని ఈ లోకంలోకి వచ్చాడు.

నీరసంగా అనిపించింది. టీ బండి వైపు నడిచాడు. ముఖం మీద చల్లటి నీళ్లు చల్లుకోగానే కాస్త తెరిపినిచ్చినట్లయింది.

వేడి వేడి టీ తాగుతుంటే ఏ మూలల్లోనో దాక్కున్న శక్తి కొద్ది కొద్దిగా శరీరాన్ని ఆవరించినట్లయింది.

స్టూలు లాక్కుని కూర్చున్నాడు.

'రెండు గంటల వ్యవధిలో తన జీవితమెంత తల్లకిందులైపోయింది? మానవత బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అమరనాథరెడ్డి ఎవరికో రక్తం కావాలని చెబితే పొద్దుటే యూనివర్శిటీ నుంచి వచ్చేశాడు. ఆయన రావడం ఆలస్యమైతే ఈ లోపు తన రక్తం శాంపిల్ పరీక్షించడం... ఆ తర్వాత ఆ తర్వాత...జీవితంలోనే అతి భయంకరమైన క్షణాలు...

డాక్టరు గారి గదిలో...

తను ఆవేశంతో ఊగిపోతూ ''సార్ మీరేం మాట్లాడుతున్నారో తెలిసే మాట్లాడుతున్నారా? అసలు..అసలు టెస్టులు సరిగా చేశారా?' అన్నాడు. ఇలాంటి పరిస్థితిని చాలా సార్లు ఎదుర్కొన్నట్లు ఆయన నిదానంగా లేచారు. ఎదురుగా కూర్చున్న తన వద్దకు వచ్చి అనునయంగా భుజం మీద తట్టారు.

''ప్లీజ్ కూల్‌డౌన్ మై బోయ్! ప్రాథమికంగా ట్రైథాట్ టెస్టుతో పాటు నిర్ధారణ టెస్ట్ కూడా చేశాం. పాజిటివ్ వచ్చింది. ఐ యామ్ సో సారీ, కానీ ఇంతటితో జీవితం అయిపోలేదు. చదువుకున్నవాడివి. జీవితం పట్ల బీ పాజిటివ్'' సానుభూతిగా అన్నారాయన.

తనలో ఆవేశం పోయి దుఃఖం పొంగుకొచ్చింది. డాక్టర్‌చేతులు పట్టుకొని ''సార్! నిజం మా అమ్మ మీదొట్టు. ఇంతవరకూ ఏ స్త్రీనీ కనీసం తాకనైనా లేదు. అలాంటిది ఎయిడ్సంటే...'' గొంతు పూడుకుపోయింది.

''ఒక్క లైంగిక సంబంధమే కాదు. రక్తమార్పిడి, సిరెంజులు, తల్లి నుంచి బిడ్డకు ఇలా నాలుగు రకాలుగా వైరస్ వ్యాపించవచ్చు. రక్తమార్పిడి, సిరెంజిల విషయం ఆలోచించు.''

''అవును..అవున్సార్! దాదాపు ఆరునెలల కిందట రోడ్డు దాటుతుంటే జీపు గుద్దింది. అప్పుడు ఎమర్జెన్సీలో ఏదో ప్రవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నాది 'ఎ'పాజిటివ్. హడావుడిగా ఎవరి నుంచో రక్తం తీసుకొన్నారు. నేనప్పుడు అపస్మారక స్థితిలో వున్నాను. కచ్చితంగా...కచ్చితంగా అదే కారణమై వుంటుంది'' దుఃఖంతో ఆపైన మాట్లాడలేకపోయాడు.

డాక్టర్ మెల్లగా ''నీకు అభ్యంతరం లేకపోతే మా కౌన్సిలర్‌ను కలువు. కొన్ని విషయాలు చెబుతారు'' అన్నాడు.

''నేను మళ్లీ కలుస్తాను సార్!'' అని సమాధానమిచ్చాడు తను.

''చూడు బాబూ...మరోసారి చెబుతున్నా- ఎయిడ్స్ వస్తూనే చావు కోసం వేచి చూడాలనేం లేదు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చు. నాకు యాభై రెండేళ్లు. సంపూర్ణ ఆరోగ్యవంతుడిని. అలాగని వందేళ్లు బతుకుతామన్న గ్యారంటీ అయితే ఏమీ లేదు కదా! ఏ క్షణంలోనైనా చావొచ్చు. అందరికీ ఎయిడ్సే రానవసరం లేదు. నీకోసం రేపు మేము వెయిట్ చేస్తూంటాం'' అన్నాడు డాక్టర్ షేక్ హ్యాండిస్తూ..

తనిలా బయటకొచ్చేశాడు.

టీ తాగడం అయిపోయింది. యూనివర్శిటీకి బస్సుకోసం బస్టాపు వైపు నడవసాగాడు.

'వాహనాల శబ్దాలు...జనాల మాటలు కలగాపులగంగా...సంతోషాలు దుఃఖాలు ఆవేశాలు రకరకాల భావోద్వేగాలు... ఎవరో సెల్‌ఫోన్లో పగలబడి నవ్వుతున్నారు. మరో జంట ఈ లోకాన్ని మరిచి...! తనొక్కడ్నే ఒంటర్ని చేసి ఈ ప్రపంచమంతా ఆనందడోలికల్లో మునిగిపోతోంది. ఎక్కడో ఎక్కడెక్కడో అంతరాంతరాల్లోంచి నైతిక విలువల పొరను చివ్వుమని చీల్చుకొని వచ్చిన కసి.... వికృతంగా! ఫెడేలని ముఖానికేసుకున్న మంచితనపు ముసుగును గుద్దుకుని ఆ శకలాలు మనసు పొరల్లో విషంలా వ్యాపిస్తూ...పోవాలి. ఈ ప్రపంచమంతా తనతో పాటు నాశనమైపోవాలి. తనకు లేని ఆనందం వీళ్లకు మాత్రం ఎందుకుండాలి.....చచ్చే ప్రతి ఒక్కరూ ఇలాగే ఆలోచిస్తాడా? అయినా అందరూ ఆనందంగా బతుకుతున్నారన్నది భ్రమేనేమో. సాధువులు, సన్యాసులతో సహా అందరిలోనూ అశాంతి వుండదూ? వుంటుంది-అయితే ఛోడ్ దో యే దునియాకో...అరే ఓ సాంబా..సారే ఆద్మీ కో ఛోడ్ దో...'

బస్సెక్కాడు.

తన అమ్మానాన్నలు గుర్తొచ్చారు.

'అమ్మ-మావోడు ఏందో గ్రూపులంటమ్మా. పెద్ద ఉద్యోగానికి సదువుతా వుండాడులే' అని అందరికీ చెప్తూ వుంటుంది.

నాన్న- ఆ వుద్యోగమేదో తొందరగా వస్తే పదెకరాల్లో బోరు వేయించి డ్రిప్పుపెట్టి ఏదో ఒకటి పచ్చగా పంటను చూడాలని కలకంటూ వుంటాడు.

వారికి తన విషయం తెలిస్తే... గుండె పగిలి చస్తారేమో!

లేదు లేదు చావకపోవచ్చు

కొత్తగా చచ్చేదేముంది? ప్రతి సంవత్సరం పంట రాక చావును అనుభవిస్తూనే వున్నారు కదా!

తన ముత్తాత వందెకరాల ఆసామినట. తన తండ్రి ఇప్పుడు రైతుకూలీ. కారణం కరువే!

పస్తులతో కాలం వెళ్లదీసిన అమ్మానాన్నలు తనను యూనివర్శిటీ వరకూ ఎలా చదివించగలిగారు!

తన రోగంతో వాళ్లను సర్వనాశనం చేసేకంటే తనే నిష్క్రమించాలి.

యూనివర్శిటీలో అడుగుపెడుతుంటే మొదట్లోనే కృష్ణదేవరాయల విగ్రహం-దేశభాషలందు తెలుగు లెస్స

ఔనా! హూ...అన్ని రోగముల యందు ఎయిడ్స్..?? చివర్లో ఏ ప్రాస పదం పెట్టాలో ఆలోచించి చావాలి.

చిన్న సవరణ- ఆలోచించకపోయినా చావొచ్చు

అమ్మ ఒడిలాంటి యూనివర్శిటీ... ఎన్ని కలలు... ఎన్ని ఆశయాలు!

అన్నీ గాల్లో కలిసిపోతాయి. తన ప్రాణంతో పాటే...

రూంకొచ్చాడు. తన రూమ్మేటు చందు లేడు. టౌనుకు వెళ్లినట్లున్నాడు.

రాజు షర్టు విప్పి తలుపులు దగ్గరగా వేశాడు. నిండా ముసుగు కప్పుకున్నాడు. కుళ్లి కుళ్లి ఏడ్చాడు.

'ఛ..చావాలని నిర్ణయించుకొన్నాక ఏడ్వటమెందుకు?' అనుకొని కొంచెం ఊరట... మళ్లీ దుఃఖం.. అలసి సొలసి అలాగే నిద్రపోయాడు.


''రాజూ...రేయ్ రాజూ!'' తట్టి లేపాడు చందు.

దిగ్గున లేచి కూచున్నాడు రాజు. గడియారం వైపు చూశాడు. నాలుగు గంటలు కావస్తోంది. చందు వైపు నిస్తేజంగా చూశాడు.

''రేయ్ ఏమైంది నీకు? ఆరోగ్యం బాలేదా? అన్నం తిన్నావా?'' ఆందోళనగా రాజును కుదుపుతూ అడిగాడు చందు.''రెండ్రూపాయలు చిల్లర కావల్సొచ్చి నీ జేబు వెతికాను. ఇవి కనిపించాయి.

ఇన్ని... ఇన్ని నిద్ర మాత్రలు..అంటే..అంటే...'' అంతవరకూ వాటి గురించి అంతగా ఆలోచించని చందు, ఒక్కసారిగా విషయం అర్థమై ఉలిక్కిపడ్డాడు.

''రేయ్ నోరు విప్పరా! నీకు పుణ్యముంటుంది




ప్లీజ్'' దాదాపు అరుస్తున్నట్లు అన్నాడు చందు

రాజు తూలుకుంటూ లేచాడు. తలుపు గడియ పెట్టి వచ్చి...నోరు విప్పాడు.

''నేను నేను చచ్చిపోవాలనుకుంటున్నాను. నాకు హెచ్ఐవి పాజిటివ్'' గొణుగుతున్నట్లు అన్నాడు.

చందు దిగ్భ్రాంతితో చూశాడు. ''నీ...నీకు ఎయిడ్సేంటి?! జోకులు...జోకులు కదూ...''అన్నాడు!

ఇంకా ఏమూలో మిగిలిపోయిన దుఃఖం ఉప్పెనై.. భోరుమని ఏడుస్తూ ''లేదు...నిజంగానే! ఆర్నెల్ల కిందట రక్త మార్పిడి జరిగినప్పుడు సోకింది. ఈ రోజు టెస్టుల్లో తేలింది'' అన్నాడు రాజు.

ఓ పదినిమిషాలు ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

చందు-రాజు భుజం మీద తట్టి '' నువ్వు త్వరగా రడీ అవ్వు. అట్లా బైటకు పోదాం'' అన్నాడు.

''ఒద్దురా నేను రాలేను. రాబుద్ధి కావడంలేదు''

''నేను చెబుతున్నాను కదా!'' అంటూ బలవంతంగా బాత్రూం వైపు తోశాడు. ఇద్దరూ తయారై యూనివర్శిటీ బయటకు వచ్చారు. అనంతపురం టౌను వైపు డీజిల్ ఆటో ఎక్కారు. ఓ మూడు కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత చందూ ఆటోను ఆపాడు. మెయిన్ రోడ్డు నుంచి కాస్త లోపలకి నడిచారు.

''అమృత హస్తాలు'' అన్న ఓ స్వచ్ఛంద సేవా సంస్థ బోర్డు కనిపించింది. అక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది.

లోపల ఓ నడివయస్కుడు వున్నాడు.

చందును చూస్తూనే లేచి, షేక్ హ్యాండిస్తూ '' హాయ్ చందూ.. ఎలా వున్నావ్'' అన్నాడు.

''బావున్నాను. ఇతను నా ఫ్రెండ్ రాజు''

''హలో సర్! నాపేరు సుధీర్. ఇదిగో ఈ స్వచ్ఛంద సేవా సంస్థను నడుపుతున్నాను. అందరూ చిన్నపిల్లలే. అందరూ ఎయిడ్స్‌ను మోస్తున్నవారే. వాళ్లకు కేర్ టేకర్లు, వంటవాళ్లు, పనివాళ్లు, చదువు చెప్పేవాళ్లు అందరూ పాజిటివే. భయపడకండి మీకేమీ సోకదు'' నవ్వుతూ అన్నాడు.

చందు ఇబ్బందిగా కదిలి ''సుధీర్ నిజానికి... తను పాజిటివ్'' అన్నాడు.

సుధీర్ బాధపడ్తూ ''ఓహ్! సారీ సో సారీ సర్. భయపడకండి. ఆనందంగా బతకడం నేర్చుకోండి. చనిపోవాలనే ఊహను రానీయకండి. రండి పిల్లల్ని చూద్దురు కానీ!''

ముగ్గురూ పార్కులోకి ప్రవేశించారు.

టీచర్లు కథలు చెబుతుంటూ పిల్లలంతా చుట్టూ మూగి ఆనందంగా వింటున్నారు. మరొక చోట గేయాలు పాడుతున్నారు.

నలుగురు టీచర్లు - దాదాపు ఎనభైమంది వరకూ పిల్లలు.

ఈ లోపు సుధీర్‌కు ఫోన్ రావడంతో ఆఫీసువైపు వెళ్లాడు.

రాజులో తప్పకుండా ఆశాభావం మొలకెత్తుతుందని నమ్మకంగా వున్న చందు అక్కడి నుంచి కాస్త దూరంగా వచ్చాడు. రాజుకు ఆలోచించుకోవడానికి అవకాశం ఇస్తూ...

చందు అనుకున్నట్లే, అక్కడి వాతావరణం రాజులో కొత్త ఉత్సాహం నింపుతోంది. మనసులో కమ్ముకున్న మబ్బులు విడిపోతున్నట్లు అనిపించింది.

అంతులేని దుఃఖం నుంచి విడవడి ప్రశాంతభావనను కావలించుకున్నట్లు... అనిర్వచనీయమైన నిర్మలత్వం అతన్ని ఆవహించింది.

మెత్తటి గడ్డిమీద అలాగే కూచుండిపోయాడు.

''నేను ఎందుకు చావాలనుకున్నాను?'' ప్రశ్నించుకున్నాడు.

సమాజానికి భయపడి..

వ్యభిచరించాననని అంటారని భయపడి...

లేదు...నేను తప్పు చేయలేదు. ఈ లోకంలో బతకడానికి నాకూ హక్కుంది.

భారతీయులు, అపరిచితులు, ఠాగూర్లు వెండితెర మీద లంచగొండులను ఉతికి ఆరేస్తుంటే...రెండున్నర గంటల అంతరాత్మ స్వయం తృప్తిలో భావప్రాప్తి పొంది బయటకొచ్చాక..మళ్లీ ముసుగులతో సిద్ధమై... ఒక రూపాయి నుంచి కక్కుర్తి మొదలు పెట్టే లంచావతారాలు ఈ సమాజంలో పెద్ద మనుషులుగా తిరుగుతూనే వున్నారు.

మతోన్మాదులు, మదోన్మాదులు...పిల్లల్ని తల్లుల్ని అరాచకంగా చెరిచి చంపి బయట హీరోల్లా తిరగడం లేదా?

యుద్ధోన్మాదులు ఏకంగా దేశాల్నే ఏలుతున్నారు. ఎంతమంది ఉసురుపోసుకున్నారు!

ఇట్లాంటి బ్లడీ బాస్టర్డ్స్‌తో పోల్చుకున్నప్పుడు చదువుకుని, బాధ్యత తెల్సిన తాను ఎయిడ్స్ రోగిగా ఈ సమాజానికి కలిగించే నష్టం ఏమిటసలు?

డాక్టరు గారు ఏమన్నారు?

బీ పాజిటివ్... నాది 'ఎ' పాజిటివ్..ఛట్ జోకులొద్దు. పాజిటివ్‌గానే ఆలోచిద్దాం.

మానవ చరిత్ర మొత్తాన్ని పరిశీలిస్తే ప్రతి సందర్భంలోనూ ఏదో ఒక జబ్బు అంతుపట్టకుండా మనిషిని పీడించింది కదా! అప్పుడు ఊళ్లకు ఊళ్లే ఊడేసిన కలరా, మశూచి, ప్లేగులాంటివి ఇప్పుడు ప్రాణాంతకం కాదు. ఈ క్రమంలోనే నేడు ఎయిడ్స్.. ఏమో! దీనికి కూడా మందును రేపే కనుక్కోవచ్చు ఎవరూహించారు?

ఎస్..తాను బతుకుతాడు. బతకాలి. తాను ఎయిడ్స్ రోగే కావచ్చు. కానీ తన కంటే దీనంగా హీనంగా నికృష్టంగా రోజులీడుస్తున్న జనాలు ఈ భూమ్మీద కోట్లాదిమంది, ఏ ఆశతో వాళ్లు బతుకుతున్నారు. మరి?

అసలు సమస్త మానవాళి కోసం ప్రాణాలర్పించిన శాస్త్రవేత్తలు, మత ప్రవక్తలు, వీరులు, సంఘసేవకుల త్యాగాల ముందు పిరికిగా చావాలన్న తన చావు ఎత్తె అల్పమైంది?

తల్లిదండ్రుల తప్పులకు ఎయిడ్స్ శిక్ష అనుభవిస్తున్న ఈ అమాయక చిన్నారులను తను కూడా అక్కున చేర్చుకుంటాడు. మనసులోని దుఃఖం, నిరాశ ఏమైపోయాయో తెలీదు.

ఈ లోకంలోకొచ్చారు.

కాస్త దూరంలో చందు, సుధీర్ నిలబడి తన వైపే చూస్తున్నారు.

''నేను, మీతో కలిసి పనిచేస్తాను. మీకు అభ్యంతరం లేకపోతే'' అన్నాడు రాజు

''మోస్ట్ వెల్‌కమ్ చేయి చాచాడు'' సుధీర్

చందు రాజు వైపు చూస్తూ నీకో విషయం తెల్సా ''సుధీర్ కూడా ఎయిడ్స్ పేషెంట్'' అన్నాడు.

రాజు మెల్లగా నవ్వాడు. పొద్దున్నుంచి మొదటిసారి...మొట్టమొదటిసారిగా తను నవ్వాడు. ఆ నవ్వు తనకు తెలుస్తోంది. దాన్ని అనుభవించగలుగుతున్నాడు. ''నేనూ ఊహించా! ఇంతటి ప్రేమ పూరిత వాతావరణాన్ని బాధాతప్తహృదయులే సృష్టించగలరు!'' అన్నాడు.

సుధీర్-''థ్యాంక్యూ, ఇక్కడ ఈర్ష్యా ద్వేషాలు కావు. కోపతాపాలు లేవు. పొరపాటున తాకితే అసహ్యంగా చూసేవాళ్లు అసలే లేరు. ఇది మన ప్రపంచం. బతికినన్నాళ్లు ఆనందంగా బతుకుదాం'' అని చెప్పాడు.

మనస్ఫూర్తిగా తలూపాడు రాజు

కనుచూపు మేర తెల్లటి మేఘాల్ని పరుచుకున్న ఆకాశం ఆసక్తిగా ఈ ప్రపంచాన్ని చూస్తున్నట్లు అన్పిస్తోంది.

★